వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం

కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లాలో పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్ బాబు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు నివేదించారు. శనివారం నాడు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుంచి ఎన్నికల ప్రధానాధికారి ఎన్నికల నిర్వహణ, సంసిద్ధతపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.అరుణ్ బాబు, సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్‌ఒ కొండయ్య, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖతో పాటు నియోజకవర్గాల ఈఆర్‌ఒలు, కలెక్టరేట్ ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల సమర్థవంత నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు రూపొందించి, ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి మొదటి దఫా శిక్షణను ఇవ్వడం జరిగిందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాలన్నింటిలో విద్యుత్, టాయిలెట్లు, మంచినీటి వసతి తదితర మౌళిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. భద్రతా ఏర్పాట్లకు సంబంధించి జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకుని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ త్వరలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని అన్ని జిల్లాల కలెక్టర్లను సూచించారు.

న్యాయం అందించడంలో ఇద్దరి పాత్ర ఒక్కటే..

- వృత్తిలో నైతిక విలువలు పాటించాలి
- యువ న్యాయవాదులకు సుప్రీంకోర్టు జడ్జీల ఉద్బోధ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కక్షిదారుడికి (క్లైయింట్) న్యాయమందించడంలో న్యాయమూర్తి, న్యాయవాది ఇద్దరి పాత్ర ఒక్కటేనని సుప్రీం కోర్టు జస్టిస్ ఆశానుద్దీన్ అమానుల్లా తెలియజేశారు. అనంతపురం నగరంలోని జెఎన్‌టియులో యువ న్యాయవాదుల శిక్షణ తరగతులు శనివారం నాడు జరిగాయి. ఈ శిక్షణ కార్యక్రమంలో న్యాయకోవిధులు, యువ న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మూడు సెషన్లుగా ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ముగ్గురు ప్రధాన వక్తలుగా హాజరవగా, రాష్ట్ర హైకోర్టు జడ్జిలు, న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు. 'ఇంపార్టెన్సు ఆఫ్ ఎథిక్స్ ఇన్ లీగల్ ప్రొఫెషన్' అన్న అంశంపైన ఆశానుద్దీన్ అమానుల్లా ప్రసంగించారు. న్యాయవాద వృత్తిలో ఉన్న వారు నైతిక విలువలను పాటించాలని సూచించారు. ఇక్కడ న్యాయమూర్తులు, న్యాయవాదులు వేరువేరు కాదని పేర్కొన్నారు. ఇద్దరి పాత్ర ఒక్కటేనని చెప్పారు. కక్షిదారుడికి న్యాయం చేయడమే ఇద్దరి లక్ష్యమన్నారు. ఈ వృత్తిలోనున్న వారు సామాజిక స్పృహతోపాటు నైతిక విలువలను పాటించాలని సూచించారు. ఇది వరకు అనేక మంది రాజకీయ నాయకులుగానూ, ప్రజాప్రతినిధులుగానూ న్యాయవాదులుండేవారని పేర్కొన్నారు. ఇప్పుడు యువ న్యాయవాదులు కూడా నైతిక విలువలతో పనిచేయాలని సూచించారు. 'ఎఫెక్టివ్ కోర్టు రూమ్ అడ్వొకసి' అన్న అంశంపై జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రసంగించారు. న్యాయవాద వృత్తిలో రాణించాలంటే అధ్యయం ఎంతో అవసరమన్నారు. తద్వారానే నైపుణ్యతను సాధించగలరని చెప్పారు. కృత్రిమ మేధస్సును ఉపయోగించుకుని కట్ అండ్ పేస్టే

న్యాయవాదుల శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సుప్రీం కోర్టు జడ్జీలు అశానుద్దీన్ అమానుల్లా, ప్రశాంత్‌కుమార్‌మిశ్రా, ఎస్‌విఎన్‌బట్టి

విధానాన్ని పాటించే పరిస్థితులు వస్తున్నాయని, అది సరైంది కాదని అన్నారు. నిరంతరం అధ్యయనం చేయడం ద్వారానే నైపుణ్యత పెరుగుతుందన్నారు. తద్వారా స్వతంత్రంగా పనిచేయగలుగుతారని చెప్పారు. పూర్వపు కేసుల్లో తీర్పులకు సంబంధించిన అంశాలను పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తూ ఉండాల్సిన అవసరం ఉంటుందన్నారు. నిరంతరం అధ్యయనం ద్వారానే వృత్తి నైపుణ్యతను తద్వారా గౌరవాన్ని పొందగలరని సూచించారు. 'రూల్ ఆఫ్ లా అండ్ రోల్ ఆఫ్ అడ్వకేట్స్ ఇన్ బిల్డింగ్ ప్రాస్పరస్ భారత్' అన్న అంశంపై ఎస్‌విఎన్.భట్టి మాట్లాడారు. భారత నిర్మాణంలో న్యాయవాదుల పాత్ర కీలకమన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారత దేశం సుసంపన్నంగా వర్ధిలాలి అంటే చట్టం అందరికీ సమాన్న భావన కలగాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి జస్టిస్ వి.దుర్గాప్రసాద్ రావు, జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ కే.మన్మధరావు, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ శ్యామసుందర్, చెన్నై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ఛైర్మన్ అండ్ అడ్వకేట్ ఎస్.ప్రభాకరన్, ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఘంటా రామారావు, కె.రామజగదీశ్వరరావు, అనంతపురం జిల్లా జడ్జి జి.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విశ్వనాథరెడ్డి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ఛైర్మన్‌ఎ.రామిరెడ్డి, సీనియర్ అడ్వొకేట్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ తరగతుల అనంతరం ముగ్గురు న్యాయమూర్తులకు బార్ కౌన్సిల్ అసోసియేషన్ సభ్యులు శాలువాలు కప్పి సత్కరించారు. జిల్లా కలెక్టరు గౌతమి వారికి జ్ఞాపికలను అందజేశారు.

లేపాక్షి ఆలయాన్ని సందర్శిస్తున్న సుప్రీం కోర్టు జడ్జి అశానుద్దీన్ అమానుల్లా

లేపాక్షి ఆలయం సందర్శన

లేపాక్షి : మండల కేంద్రంలోని దుర్గా పాపానేశ్వర ఆలయం, లేపాక్షి చారిత్రాత్మక కట్టడాలను సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా జడ్జి గౌరవ జస్టిస్ అశానుద్దీన్ అమానుల్లా, జడ్జి వెంకట్ నారాయణ బట్టిలు శనివారం సందర్శించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ విశిష్టతను తెలియజేసారు. లేపాక్షి ఆలయం సందర్శించి శిల్పకళా నైపుణ్యాన్ని చూసి ముగ్ధులయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ మాధవరెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాలోని అదనపు సివిల్ జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాల గోడపత్రికలు, కరపత్రికలను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ఏపీ స్టేట్ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ ఆవిష్కరించారు. శనివారం వైసిపి కార్యాలయంలో వీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ చూపిన మార్గంలో బంజారా యువత పయనించాలని కోరారు. వడిత్య శంకర్ నాయక్ మాట్లాడుతూ, అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని సేవాలాల్ ఘడ్‌లో జరిగే జయంతి ఉత్సవాలకు ఉమ్మడి రాష్ట్రాల్లోని గిరిజనులు, ఉమ్మడి జిల్లాలోని గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, నాయకులు భాస్కర్ నాయక్, సుమతి భాస్కర్ నాయక్, హనుమంతు నాయక్, శివ నాయక్ పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లా హాకీ జట్టు సత్తా

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కర్నూల్‌లో జరుగుతున్న 13వ సబ్ జూనియర్ పోటీల్లో రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో సత్యసాయి జిల్లా జట్టు సత్తా చాటింది. ప్రకాశంతో జరిగిన పోటీల్లో 2-1 గోల్స్ తేడాతో, గుంటూరు జిల్లాపై 4-1 గోల్స్ తేడాతో సత్యసాయి జిల్లా జట్టు విజయం సాధించిందని హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు సూర్యప్రకాష్ తెలిపారు. తదుపరి లీగ్ మ్యాచ్లో జిల్లా జట్టు వెస్ట్ గోదావరి జిల్లా జట్టుతో తలపడనున్నదని తెలిపారు.

రాజకీయంగా ఎదుర్కోలేక దుష్ప్రచారాలు

ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాజకీయంగా ఎదురుకోలేక కొందరు తనపై దుష్ప్రచారాలు చేస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను నారా లోకేష్‌ను కలిశానని, టిడిపిలో చేరుతానంటూ కొందరు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తన ప్రాణం ఉన్నంతవరకు వైసీపీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి కుటుంబంతో తమ కుటుంబానికి అనుబంధం ఉందన్నారు. నారా లోకేష్‌ను తాను రాజకీయ నాయకుడిగా గుర్తించలేదన్నారు. మాజీ మావోయిస్టు లోచర్ల పెద్దారెడ్డి విగ్రహం మాయం కావడానికి తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. లోచర్ల విజయభాస్కర్ రెడ్డికి ఎలాంటి నామినేటెడ్

విలేకరులతో మాట్లాడుతున్న దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

పోస్టు ఇవ్వలేదన్న అక్కసుతో తనపై అనవసరంగా నిందలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మావోయిస్టుల కాలనీని ఏర్పాటు చేసిందే తానన్నారు. పెద్దారెడ్డి విగ్రహం నెలకొల్పడంలో తాను ప్రత్యక్షంగా ఉన్నానని చెప్పారు. ఇక విజయ్ భాస్కర్ రెడ్డికి మావోయిస్టుల మధ్య విభేదాలు ఉన్నాయన్నారు. విగ్రహాలు ఎత్తుకెళ్లే సంస్కృతి తనది కాదన్నారు. ఎమ్మెల్యేగా తనపై కొందరికి అసమ్మతి ఉండవచ్చన్నారు. ఎమ్మెల్యే టికెట్టును ఎవరైనా ఆశించవచ్చన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మరోసారి పుట్టపర్తిలో తాను ఎమ్మెల్యేగా గెలువబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 14 నుంచి నల్లమాడ మండలం చారుపల్లి నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తానని తెలియజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో ఆరు బృందాలు ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు. 18న ఉమ్మడి జిల్లాల సిద్ధం మహాసభను రాప్తాడులో నిర్వహిస్తున్నామని, ఇందులో నియోజకవర్గం నుంచి వైసిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నెడ్ క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం

- అంగన్వాడీల ఉద్యమం స్ఫూర్తిదాయకం
- సిఐటియు రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-హిందూపురం

కార్పొరేట్ ప్రభుత్వాలు కార్మిక సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలతోనే సాధ్యం అవుతుందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. శనివారం హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు జరిగాయి. శిక్షణలో భాగంగా రాంభూపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న వైసిపి ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తుయన్నారు. వీరికి కార్మిక సమస్యలు, కార్మిక చట్టాలు అంటే ఏ మాత్రం గౌరవం లేదన్నారు. కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా 4 కోడ్‌లుగా మార్చి, కార్మికులను కార్పొరేట్లకు బానిసలుగా మార్చాలని చూస్తున్నారన్నారు. వైసిపి, బిజెపి, టిడిపి, జనసేన పార్టీలన్నీ అధికార దాహం తప్ప పేదలు, కార్మికుల సంక్షేమం గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వెంటనే జీవోలు విడుదల చేయాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో కార్మిక వర్గ సంక్షేమం, అభివద్ధి చేసే ప్రభుత్వాలను ఎన్నుకోవాలని సూచించారు. సత్యసాయి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే అలుపెరగని సుదీర్ఘ పోరాటం నిర్వహించి విజయం సాధించిన అంగన్వాడీల పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. ఇదే ఉద్యమ స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలను కొనసాగించాలన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, కోశాధికారి సాంబశివ, సిఐటియు జిల్లా నాయకులు రమేష్, లక్ష్మీనారాయణ, దిల్షాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, స్థానిక సిఐటియు నాయకులు రాజప్ప, రామక్రిష్ణ, అత్తార్‌బాబు, డివైఎఫ్‌ఐ నాయకులు రవి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మాబున్నీ, ప్రధాన కార్యదర్శి వి.శ్రీదేవి, కోశాధికారి సిఎస్.శ్రీదేవి, జిల్లా నాయకులు ఉషారాణి, మహదేవమ్మ, రంగమ్మ, లావణ్య, నాగమణి, భావమ్మ, పద్మ, సుశీల, రమ ణమ్మ, లక్ష్మీదేవి, సుజాత, శోభారాణి పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు రాంభూపాల్

ప్రభుత్వం అంగీకరించిన హామీలను అమలు చేయాలి

కరసాల సుబ్బారావమ్మ

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమెండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు 42 రోజుల పాటు చేసిన సమ్మెకు ప్రభుత్వం దిగి వచ్చి చర్చలు జరిపి అంగీకరించిన వాటిని వెంటనే అమలు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరసాల సుబ్బారావమ్మ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మె విజయవంతం అయిన నేపథ్యంలో శనివారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా స్థాయిలో రెండు రోజుల పాటు రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన అభినందన సభకు సంఘం జిల్లా అధ్యక్షులు మాబున్నీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కరసాల సుబ్బారావమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో వామపక్ష ప్రజాతంత్ర వాదులు, ఉద్యమ కారులు సహకారంతోనే అంగన్వాడీల సమ్మె విజయవంతం అయ్యిందన్నారు. రాబోయే రోజుల్లో ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, ప్రభుత్వం అంగీకరించిన వాటికి జీవోల అమలుకు కోసం పోరాటాలు చేయాల్సుందన్నారు.

పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

డివిజన్ పరిధిలోని ఏడు మండలాల పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే తమ లక్ష్యం అని డిప్యూటీ డిఎంహెచ్ఒ సిల్వియా సాల్మాన్ తెలిపారు. శనివారం నాడు వారు విలేకరులతో మాట్లాడుతూ చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం నిమిత్తం డివిజన్ పరిధిలోని ధర్మవరం అర్బన్, రూరల్ దర్శనమల, ముదిగుబ్బ, తాడిమర్రి, బత్తలపల్లి, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పూర్తి దశలో ఆల్బెండజోల్ మాత్రాలను మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది ద్వారా ఈనెల 9న పంపిణీ చేశామన్నారు. ప్రతి పాఠశాలలోనూ వీటి పై సంపూర్ణంగా అవగాహన కల్పించి ఆడపిల్లలకు మాత్రలను ఇచ్చామన్నారు. ఇంకా వీటిని వేసుకొని పిల్లలకు ఈనెల 16వ తేదీన అందిస్తామని చెప్పారు. ఆల్బెండల్ జోల్ మాత్రలు వేయడంతో వారి కడుపులోని నులిపురుగులు నశిస్తాయన్నారు.

జెసిబి యజమానులతో తహాశీల్దార్ సమావేశం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం తహశీల్దార్ నరేంద్రకుమార్ స్థానిక జెసిబి యజమాను లతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ అధికారుల అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాల్లో జెసిబిలతో పని చేస్తే జెసిబి సీజ్ చేసి యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా జెసిబితో పని చేయించుకోవాలంటే ఆ వ్యక్తి నుంచి ప్రభుత్వ భూమికి సంబంధించిన హామీ పత్రాలు పరిశీలించాలని సూచించారు. ఎలాంటి అనుమతి, పత్రాలు లేకుండా మట్టి తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. వాగులు, వంకలు కబ్జా చేసినా చర్యలు తప్పవన్నారు. సమావేశంలో వీఆర్వో కిష్టప్ప, రఘు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, జెసిబి యజమానులు ు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలయ్యపై విమర్శలు తగదు

ప్రజాశక్తి-లేపాక్షి

ఎమ్మెల్యే బాలకృష్ణపై వైసిపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని టిడిపి నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం టిడిపి నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలయ్య నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్నారన్నారు. మండల వ్యాప్తంగా రూ. 70లక్షలతో సీసీ, బీటీ రోడ్లు వేయించారన్నారు. ఆరోగ్య రథం ద్వారా ఉచిత వైద్య సేవలు, అన్నా కాంటీన్ ద్వారా భోజనం అందిస్తున్నారన్నారు. లేపాక్షిని పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చేశారన్నా రు. వైసిపి ప్రభుత్వం మండలంలో ఏ ఒక్క అభివృద్ధి పని చేయలేదన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా నీళ్లు కూడా తీసుకురాలేదన్నారు. నాడు-నేడు పేరుతో నిధులు స్వాహా చేసిన వైసిపి నాయకులు అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయప్ప, ఆనంద్‌కుమార్, రామాంజనమ్మ, నాయకులు చంద్ర, రవి, తిప్పారెడ్డి, అభి పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

బాధ్యతలు చేపట్టిన అనంత డిఇఒ

బాధ్యతలు స్వీకరిస్తున్న డిఇఒ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురం జిల్లా రెగ్యులర్ విద్యాశాఖ అధికారిగా వరలక్ష్మి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు పరీక్షల విభాగం అసిస్టెంట్ కమీషనర్ గోవింద నాయక్, ఎడిఎ కృష్ణయ్య , సూపరింటెండెంట్లు శ్రీనాథ్, సిబ్బంది పార్థసారథి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వినియోగదారుల సంఘం నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని వినియోగదారుల సమాచార సంఘం కార్యాలయంలో పట్టణ నూతన కమిటీని శనివారం ఎంపిక చేశారు. అధ్యక్షులుగా జి.కుళ్లాయప్ప, ఉపాధ్యక్షులుగా ఎన్.శుభాన్, కార్యదర్శిగా జంగమన్న, సహాయ కార్యదర్శిగా నారాయణస్వామి, కోశాధికారిగా కాకుమాని రవీంద్రబాబు, గౌరవాధ్యక్షులుగా ఎస్.గోవిందు, జె.సత్యనారాయణ, బి.నారాయణమ్మ, సభ్యులుగా వేణుగోపాల్, ఆంజనేయులు, పి.జనార్ధన్‌లను ఎంపిక చేశారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ విద్యాశాఖ స్ఫూర్తికి విరుద్ధం

పురపాలక సంఘం కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ విద్యాశాఖ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని మున్సిపల్ ఉపాధ్యాయుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాసులు పేర్కొన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా శనివారం మున్సిపల్ ఉపాధ్యాయులు మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఇలాంటి సర్వీసు రూల్స్‌తో మెజారిటీ మున్సిపల్ ఉపాధ్యాయులకు న్యాయం జరగదన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్ప టికే తీసుకున్న క్రమశిక్షణా చర్యలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెన్నోబులం, స్థానిక గౌరవాధ్యక్షులు బాల నారాయణస్వామి, కార్యదర్శి బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్, జిల్లా కౌన్సిలర్లు జనార్ధన్, హరిప్రసాద్, అన్సర్, హరీష్, నగేష్, జగదీశ్ పాల్గొన్నారు.

హిందూపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

జగన్ కోసం రెండు బటన్లు నొక్కండి : మంత్రి

ప్రజాశక్తి -పెనుకొండ

సిఎం జగన్ ఒక బటన్ నొక్కితే రాష్ట్రంలో కోట్లాది ప్రజల జీవితాల్లో వెలుగులు వస్తాయని, కావున వచ్చే ఎన్నికలోల ఫ్యాను గుర్తుపై రెండు బటన్లు నొక్కి వైసిపిని మరోమారు గెలిపించాలని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో శనివారం మంత్రి ఎంపి అభ్యర్థి వాల్మీకి శాంతమ్మతో కలిసి మండల వ్యాప్తంగా ఉన్న వాలంటీర్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్టోర్ డీలర్లు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు హ యాంలో 'నీరు-చెట్టు', జన్మభూమి కమిటీల రూపంలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారని విమర్శించా రు. జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని, ప్రతి ఒక్కరినీ రాజకీ యంగా పైకి తీసుకొస్తా అన్నారు. ఈ నెల 18వ తేదీ రాప్తాడు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న 'సిద్ధం' సభకు నియోజవర్గ నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేద్దామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, ఎంపిపి రామ్మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు సూర్యప్రకా ష్‌రెడ్డి, నాయకులు పుప్పం సుధాకర్‌రెడ్డి, మునిమడుగు శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

సోమందేపల్లి : స్థానిక శ్రీవెంకటేశ్వర కళ్యాణ మండపంలో మంత్రి ఉషశ్రీచరణ్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో సమావేశంలో ఎంపి అభ్యర్థి శాంతమ్మ, సర్పంచి గంగాదేవినరసింహమూర్తి, ఎంపిపి గంగమ్మ వెంకటరత్నం, కన్వీనర్ నారాయణరెడ్డి, జడ్పిటిసి డిసి అశోక్, రమాకాంత్‌రెడ్డి, సేవా దళ్ అధ్యక్షులు వేణు, నాయకులు లక్ష్మిరెడ్డి, నీరుగంటి రామంజి, ఎల్లారెడ్డి, నాగరాజురావ్, కంబాలప్ప, అమర్నాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి సీనియర్ నాయకులు డిసి ఈశ్వరయ్య, డిసి వెంకటేష్, ఎంపిపి గంగమ్మవెంకటరత్నం ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కలిసికట్టుగా పని చేసి మరోసారి జగన్‌ను సిఎం చేసుకోవాలని తెలిపారు.

'పురం' సంపదను దోచుకోవడానికే మంత్రి పర్యటనలు

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా : టిడిపి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంతో పాటు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై మేము చర్చకు సిద్ధం.. మీరు సిద్ధమా.? వేదిక కూడా మీరే చెప్పండని టిడిపి నాయకులు వైసిపి నేతల సవాల్‌కు ప్రతి సవాల్ విసిరారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 'పురం' సంపదను దోచుకోవడానికి తరచూ పర్య టిస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బాలకృష్ణపై వైసిపి నేతలు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. టిడిపి జిల్లా కార్యదర్శి అంబికా లక్ష్మినారా యణ, రాష్ట్ర నాయకులు అంజనప్ప, పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్ మాట్లాడుతూ టిడిపి ఎమ్మెల్యేలు చేస్తున్న అభివృద్ధిని చూసి 40 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు టిడిపిని ఆదరిస్తున్నారన్నారు. పెన్నా నదిలో ఇసుక దందా చేస్తుంది... చేయిస్తుంది ఎవరో ప్రజలకు తెలుసు అన్నారు. వైసిపి పాలకుల నిర్లక్ష్యం వల్ల మెడికల్ కళాశాల, జిల్లా కేంద్రం రాలేదన్నారు. మంత్రి సోదరుడు ద్వారకనాథ్‌రెడ్డి తనయుడుని ఇక్కడి నుంచి పోటీ చేయించాలని మంత్రి భావిస్తున్నట్లు పేర్కొన్నారు. పురపాలక సంఘంలో అధికారంలోకి రాగానే సంతకం పెట్టిన రైల్వే రోడ్డును ఇంత వరకూ పూర్తి చేయలేదన్నారు. ధనలక్ష్మి రోడ్డు పనులను ప్రారంభించలేదన్నారు. భయం అనేది బాలయ్య బయోడేటాలో లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీతో బాలయ్యను గెలిపించుకుని హ్యాట్రిక్ సాధిస్తామన్నారు. సమావేశంలో నాయకులు హిదయతుల్లా, శివశంకర్, రాఘవేంద్ర, సతీష్‌కుమార్, పరుశురాం, ఆర్‌ఎంఎస్ షఫీవుల్లా, వెంకటేష్, రాము, అజ్మతుల్లా పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మంత్రి భర్త చరణ్‌రెడ్డికి పేదల వినతి

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి శనివారం మండలంలోని పాలసముద్రం గ్రామంలో చేపట్టిన పర్యటనను గుడిసెలు వేసుకున్న నిరుపేదలు అడ్డుకున్నారు. దీంతో నిరుపేదలు, వైసిపి కార్యకర్తల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. స్పందించిన చరణ్ సమస్యను తెలపాలని సూచించారు. దీంతో వారు ఆయనకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తాము 8 నెలల క్రితం ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నా అధికారులు స్పందించకపోవడంతో ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని అక్కడే జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే స్థానిక నాయకుల అండదండలతో స్థానిక రెవెన్యూ అధికారి ఇబ్బందులు సృష్టిస్తున్నారని తెలిపారు. స్పందించిన చరణ్ ఎన్నికల తర్వాత ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని తెలిపారు. అంతకుముందు పేదలు సిపిఎం ఆధ్వర్యంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య అధ్యక్షతన గుడిసెల వద్ద నుంచి ర్యాలీగా వెళ్లి పాలసముద్రం చేరుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, ఇళ్ల స్థలాల సాధన కమిటీ కార్యదర్శి వజీర్, సభ్యులు అంజలి, వెంకటలక్ష్మమ్మ, ప్యారిమా, షాతాజ్, ఓంకార్, లక్ష్మీనారాయణ, స్వర్ణలత, అశ్వత్థమ్మ, లక్ష్మీదేవి, నంజుండప్ప పాల్గొన్నారు.

మంత్రి భర్త చరణ్‌రెడ్డికి వినతి పత్రి ఇస్తున్న పేదలు

ఆంజనేయస్వామి సన్నిధిలో కందికుంట యశోద

పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి సన్నిధిలో కందికుంట యశోదమ్మ

నల్లచెరువు : మండలంలో ప్రసిద్ధిగాంచిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామిని శనివారం మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ భార్య, కందికుంట నారాయణమ్మ ట్రస్ట్ ఛైర్మన్ కందికుంట యశో దమ్మ దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రచార వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెతో పాటు టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్, మహబూబ్‌సాబ్, అంజనప్ప, అశ్వర్థనాయుడు ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : ప్రశాంతి గ్రామ్‌లోని జానకిరామయ్య కాలనీలో శనివారం పిహెచ్‌సి సిబ్బంది గర్భిణులు, పిల్లలకు టీకాలు వేశారు. సిహెచ్ఒ నగేష్ గర్భిణులకు పౌష్టికాహారం, జాగ్రత్తలు, టీకాలు, కాన్పు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, తదితర విషయాలను వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి అపర్ణ, ఆరోగ్య కార్యకర్తలు ప్రమీల, అమృత, ఆశా కార్యకర్త అనిత పాల్గొన్నారు.

టిడిపిలో వంద కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పే స్వామి ఆధ్వర్యంలో శనివారం వంద కుటుంబాలు టిడిపిలో చేరాయి. మండలంలోని ఆమిదాలగొంది, హరేసముద్రం పంచాయతీలతో పాటు పట్టణానికి చెందిన వైసిపి నాయకులు రామకృష్ణ, శివకుమార్, తిమ్మరాజు, సంతోష్, రాజశేఖర్, నరసింహా, మధు, సంపత్, శ్రీరామప్ప, మారుతి, వినోద్, అశోక్, చౌడ ప్ప, అమర్నాథ్, చంద్రశేఖర్, సురేష్, కాలరామ్, లోకేష్, సుధాకర్‌రెడ్డి, మధుకృష్ణ, నటరాజ్, ఉదయ్, తదితరులు మొత్తం వంద కుటుంబాలు వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరగా వారికి గుండుమల పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. రిటైర్డ్ ఆర్‌బిఐ డైరెక్టర్ దేవరాజు, రిటైర్డ్ ఓరియంటల్ బ్యాంక్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.తిప్పేస్వామి, రిటైర్డ్ ఆర్‌బిఐ జనరల్ సెక్రటరీ లక్ష్మీనరసింహస్వామి, గుడిబండ మండలంలోని దేవరహట్టి పంచాయతీ గుడ్డదహల్లి గ్రామనికి చెందిన దేవరజు వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరగా గుండుమల పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మనోహర్, మద్దనకుంటప్ప, లక్ష్మీనారాయణ, దుర్గేష్, శివకుమార్, దేవహట్టి చిత్రశేఖర్, భక్తర్, నాగరాజు, పుల్లయ్య, కోట్ల రంగయ్యగౌడ్, చౌదరి, కౌన్సిలర్ ఉమాశంకర్, రవికుమార్, తిమ్మరాజు, మల్లికార్జున, రఘురాం, చిన్నప్ప, శ్రీనివాస్, రమేష్, రామచంద్రప్ప, మార్కెట్ బాబు, గంగాధర్, శంకర్, రమేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గుండుమల సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

ఓటు అనే వ్యాక్సిన్‌తో వైసిపి వైరస్‌ను తరిమేద్దాం

ధర్మవరం టౌన్ : సార్వత్రిక ఎన్నికల్లో ఓటు అనే వ్యాక్సిన్ తో రాష్ట్రానికి పట్టిన వైసిపి వైరస్‌ను తరిమేసి టిడిపిని అధికారంలోకి తీసుకొద్దామని రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా టిడిపి పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని 3వ వార్డులో ఇంటింటికీఈ వెళ్లి మినీమేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో సుస్థిరమైన పాలన కోసం టిడిపి, జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్ నాయుడు, రాళ్లపల్లి షరీఫ్, జిలకర శీన, అంబటి సనత్, కరెంటు ఆది, మాదన సుబ్బయ్య, గోసల శ్రీరాములు, బడిగింజల రమణ, బీరే శీన, లోకేశ్ పాల్గొన్నారు.

పాఠశాలలో మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రహమత్‌పురంలో ఉన్న అల్ ఆమీన్ పాఠశాలలో కరస్పాడెంట్ రియాజ్ ఆధ్వర్యంలో బెంగళూరు సప్తగిరి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 225 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. వివిధ రోగాలతో బాధపడుతున్న 25 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఆల్ ఇండియా టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్‌ఫారుక్‌ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాంచజన్య శ్రీనివాసులు, వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. అనంతరం వైద్యులతో పాటు సామాజిక సేవకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు ఆలూరు శేఖర్, జయవర్ధన్‌గౌడ్, వైద్య ఆరోగ్య సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం న్యామతున్నీసా, మానస్వి స్కూల్ మల్లికార్జున, ముస్తఫా స్కూల్ ముస్తఫా అలీఖాన్, ఉబెదుల్లా హుసేన్, అల్ హిరా హెచ్‌ఎం.రియాజ్ పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీలో ధర్మవరం వాసులు

ధర్మవరం టౌన్ : చేనేత కార్మిక సంఘం జిల్లా నూతన కమిటీలో ధర్మవరం వాసులకు చోటు దక్కింది. సోమందేపల్లిలో నిర్వహించిన చేనేత మొదటి మహాసభలో ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటనారాయణ, ఉపాధ్యక్షులుగా పోలా లక్ష్మీనారాయణ, విజయభాస్కర్, చట్టా రవి వర్ధన్, గౌరవాధ్య క్షులుగా వెంకటస్వామి, సహాయ కార్యదర్శులుగా చెన్నంపల్లి శ్రీనివాసులు, కేశవ, కోశాధికారిగా మల్లికా ర్జునలను ఎంపిక చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందని ఆర్టీసీ డీపీటీఓ మధుసూదన్, ధర్మవరం డీఎం సత్యనారాయణ పేర్కొన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సిబ్బందికి రెడ్ క్రాస్ సొసైటీ, యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరంతో పాటు రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ నరసింహులు 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 30 మంది రక్తదానం చేయగా వారికి డీఎం రెడ్ క్రాస్ సర్టిఫికెట్, మెమొంటో అందజేశారు. ఆర్టీసీ డీపీటీఓ మధుసూదన్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు పోలా ప్రభాకర్, జిల్లా కో ఆర్డినేటర్ రమేశ్, డైరెక్టర్ సత్యనిర్ధారణ్, ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగరాజు, వైకే.శ్రీనివాసులు, సభ్యులు ఓవీ.ప్రసాద్, గొర్రె రమేష్ బాబు, సత్రశాల మల్లికార్జున పాల్గొన్నారు.

రక్తదాతలకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

'నవోదయ'లో ప్రవేశాలకు పరీక్షలు

లేపాక్షి : మండలంలోని నవోదయ పాఠశాల, కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి శనివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఇంటర్‌లో ప్రవేశం కోసం 619 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా పరీక్షకు 410 హాజరయ్యారు. 9వ తరగతిలో ఖాళీ సీట్లకు 1003 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా పరీక్షకు 789 మంది హాజరయ్యారని ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. ఫలితాలు త్వరలోనే వెల్లడిస్తామని, అర్హత సాధించిన వారికి ప్రవేశం కల్పిస్తామన్నారు.

ఎన్ని'కల' బడ్జెట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి ఐదేళ్ల పాలన ముగియనుంది. ఐదు బడ్జెట్ తరహాలోనే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ లోనూ తీరని నిరాశనే మిగిలింది. సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని వైసిపి పాలకులు చెబుతున్నట్టుగానే సంక్షేమానికి కొంత కేటాయించినప్పటికీ అభివృద్ధి పనులు పూర్తిగ కుంటుపడ్డాయన్న విమర్శలూ ఉన్నాయి. ఈ వారంలో వైసిపి ఆఖరు బడ్జెట్‌నూ ప్రవేశపెట్టింది. దీనిపైనా విపక్షాలు దుయ్యబట్టారు. ఈ ఐదేళ్ల కాలంలో ఏం అభివృద్ధి చేసారో చూపించాలని అడుగుతున్నారు. ప్రధాన ప్రాజెక్టులేవి ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఇందులో ప్రధానంగా హంద్రీనీవా ప్రాజెక్టు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ప్రవాహ సామర్థ్యాన్ని 6వేల క్యూసెక్కులకు మొదటి దశలో పెంచి మరో 6వేల క్యూసెక్కులతో సమాంతర కాలువను తీసుకొస్తామని అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో వైసిపి నాయకులు ప్రకటించారు. చేపట్టకపోవడం ఎలాగున్నా గతంలో జరుగుతున్న పనులు కూడా మధ్యలోనే ఆగిపోయాయి. కనీసం తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ కూడా నోచుకోలేదు. అవకాశమున్న నీటిని తుంగభద్ర డ్యామ్‌కు తీసుకోలేని దుస్థితి ఏర్పడుతోంది. కనీసం మరమ్మతులు కూడా ఈ ఐదేళ్లలో చేయలేదన్న విమర్శలున్నాయి. ఇక పరిశ్రమల సంగతి వేరే చెప్పక్కర్లేదు. ఏ ఒక్క పరిశ్రమ చెప్పుకోదగినది రాలేదు. ఈ ఐదు బడ్జెట్‌లోనూ ఇదే కనిపించడంతో నిత్యం కరువులకు నిలయమైన అనంతపురం జిల్లా పరిస్థితి మరింత దయనీయంగానే మారింది. ఎప్పటి లాగానే ఉపాధి కోసం వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎక్కడైనా ఉపాధి పనులు జరిగినా వాటిని నేతలే దిగమింగిన దాఖలలు కనిపిస్తున్నాయి. ఇవి సోషియల్ ఆడిట్‌లోనూ అనేకం వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలోనే సిపిఎం సమగ్రాభివృద్ధి అంశాన్ని ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. ఇది గత నవంబరు మాసం నుంచే చేస్తున్నప్పటికీ ఈ వారంలో పుస్తకరూపంలో జిల్లా అభివృద్ధికి ఉన్న అవకాశాలను కూడా ఇందులో పేర్కొంది. దీని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల సమయంలోనైనా రాజకీయపార్టీలు జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చించే విధంగా ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. ఈ పుస్తకాన్ని రూపొందించడమే కాకుండా పలు ప్రజా సంఘాల నాయకులతోనూ ఆవిష్కరింపజేసింది. రాబోయే రోజుల్లో ఈ అంశాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లి ప్రజాప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో చేసే అభివృద్ధిపై ప్రశ్నించే విధంగా ప్రచారా కార్యమ్రాన్ని చేపట్టాలని చూస్తోంది. వాస్తవానికి ఇదే చర్చ జరగాలని పలువురు మేధావులు కోరుతున్నారు. ఎన్నికలు, రాజకీయాలంటే ఇప్పుడు అసలు సమస్యలకంటే వ్యక్తిగత దూషణలు, ఆరోపణలపైనే ఎక్కువగా ఉంటున్నాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అలా కాకుండా ప్రజా సమస్యలు ఎన్నికల ప్రచారంలో చర్చకు రావాలని కోరుకుంటున్నారు. దీనికి ఇప్పుడు పోటీ చేయబోయే నేతలు ఎటు పరిష్కారాలను చూపుతారన్న హామీలను రాబట్టే ప్రయత్నం చేయాల్సిన అవసరముంది. పాతవారే తిరిగి పోటీచేసే విధంగా అయితే గతంలో ఇచ్చిన హామీలను ఒకసారి గుర్తుచేసి, వాటి కోసం ఏం చేసారన్నది ప్రశ్నించాల్సి ఉంటుంది. ఇంకోవైపు ఎన్నికలు సమీస్తుండటంతో టిక్కెట్లు వేడి ఆయా పార్టీల్లో పెరుగుతోంది. ప్రధానంగా టిడిపి, వైసిపిల్లో టిక్కెట్ల గోల మొదలైంది. ఏదో రకంగా టిక్కెట్టును దక్కించుకునే పనిలో నేతలు నిమగ్నమై ఉన్నారు.

16న దేశవ్యాప్త గ్రామీణ బంద్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎపి రైతు సంఘం, సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ చేపట్టనున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి.రమణ పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కర్షకులు, కార్మికులు, పేదలు, మోటారు వెహి కల్ డ్రైవర్లకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొస్తున్నాయని మండిపడ్డారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసు అమలు, రూ. 2 లక్షల వరకూ రైతు రుణమాఫీ, కేరళ తరహాలో రుణవిముక్తి చట్టం, నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కింద కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ. 2 లక్షల కోట్లు, ఆహార భద్రత చట్టం అమలు, భూహక్కుల చట్టం రద్దు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, ఇన్‌పుట్, ఇన్సూరెన్స్‌ను వెంటనే మంజూరు చేయాలని డిమాం డ్ చేశారు. రైతులకు విద్యుత్ సరఫరా సక్రమంగా చేయాలని, మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించ రాదన్నారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకుడు ఎన్‌హెచ్ బాషా, ఎఐటియుసి నాయకులు వైవి.రమణ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం, సిఐటియు నాయకులు

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

పుట్టపర్తి రూరల్ : నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులను శనివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎనుమలపల్లి గ్రామానికి చెందిన నాగరాజు, నల్లమాడ మండలం బసిరెడ్డిపల్లికి చెందిన నరసమ్మలను ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం నల్లమాడ మండలంలోని వేళ్లమధ్య గ్రామంలో ఇటీవల మరణించిన దేశాయి చెన్నారెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైసిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైసిపి నాయకులు రంగారెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

యువత చేతుల్లోనే రాష్ట్ర భవిష్యత్తు : పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ఈ ఐదేళ్లలో ఎంత నష్టం జరిగిందో ఒకసారి ఆలోచించాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాల యంలో శనివారం నియోజకవర్గ విద్యార్థులు, కొత్త ఓటర్లతో ముఖాముఖి నిర్వహించారు. విద్యారంగంలో ఎదురవుతున్న ఇబ్బందులు, రాజకీయ పరిస్థితులపై అభిప్రాయాలు తెలుసుకు న్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న ఓటర్లకు శ్రీరామ్ సూచనలిచ్చారు. వైసిపి పాలనలో రాష్ట్రానికి చాలా నష్టం జరిగిందని, మరోసారి ఇలాంటి నష్టం జరగకుండా తొలిసారి ఓటు వేస్తున్న వారంతా టిడిపికి ఓటు వేసి గెలిపించాలని శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు.

14న నారా భువనేశ్వరి పర్యటన

'నిజం గెలవాలి'లో భాగంగా ఈ నెల 14వ తేదీ నారా భువనేశ్వరి సంజీవపురం వస్తున్నారని, ఆమె పర్యటనను జయప్రదం చేయాలని శ్రీరామ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి మండలానికి ఒక్కో చైతన్యరథం ఏర్పాటు చేశామని, తద్వారా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకుంటామన్నారు. నారాలోకేశ్ శంఖారావం ప్రకటన చేయగానే వైసిపిలో వణుకు మొదలైందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫణికుమార్, తలారి చంద్రమోహన్‌బాబు, నాగూర్ హుస్సేన్ పాల్గొన్నారు.

కొత్త ఓటర్లతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

కాంగ్రెస్ కమిటీ మాజీ జిల్లా అధ్యక్షులు హుస్సేన్‌పిరాన్ మృతి

కదిరి టౌన్ : పట్టణానికి చెందిన సీనియర్ రాజకీయవేత్త, కాంగ్రెస్ కమిటీ మాజీ జిల్లా అధ్యక్షులు కెఎస్. హుస్సేన్ పిరాన్(89) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీలో పని చేశారు. మాజీ స్పీకర్ కెవి వేమారెడ్డి తరం నుంచి రాజకీయంలో ఉంటూ పాత తరం రాష్ట్ర నాయకులు జలగం వెంగళరావు శిష్యునిగా అనంతపురం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా, జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షునిగా, కదిరి ఈద్గా ఖబరస్థాన్ కమిటీ అధ్యక్షునిగా, కదిరి పట్టణ స్థాయి నుంచి అఖిల భారత స్థాయి వరకు పనిచేశారు. ఆయనకు కుమారుడు కెఎస్ బహవుద్దీన్ ఉన్నారు.

హుస్సేన్‌పిరాన్ (ఫైల్‌ఫొటో)

జగన్ అరాచకాలపైనే లోకేష్ 'శంఖారావం' : మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి క్రైమ్ : సిఎం జగన్ అరాచకా లపై లోకేశ్ పూరించిన నాధమే శంఖారావం అని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శనివారం పల్లె మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసి రాక్షస పాలన కొనసాగిస్తుందన్నారు. నారా లోకేష్ చేపట్టిన శంఖారావం కార్యక్రమంతో ప్రజలకు మరింత చేరువ అవుతారని తెలిపారు.

ప్రజలకు మరింత చేరువ : కందికుంట

కదిరి టౌన్ : వైసిపి ప్రభుత్వం అరాచకాలు, సిఎం జగన్ దుర్మార్గపు ఆలోచనా విధానాలకు వ్యతిరేకంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం పూరించారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. యువగళం పాదయాత్ర జరగని నియోజకవర్గాల్లో శంఖారావం యాత్ర ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకే లోకేష్ 'శంఖారావం' ప్రచారానికి శ్రీకారం చుట్టారన్నారు. శంఖారావంతో పార్టీ కార్యకర్తలు నారా లోకేష్ వైపు మరింత చేరు వయ్యేలా చేస్తుందన్నారు. ఇందులో కార్యకర్తలు నేరుగా నారా లోకేష్‌తో తమ అభిప్రాయాలు పంచుకునే అవకాశం కల్పించారని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే విరాళం

అమరాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం మాజీ ఎమ్మెల్యే ఈరన్న రూ. 25వేలను కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం అందరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్, జడ్పిటిసి సారక్క నరసింహామూర్తి, నారాయణప్ప, కెంచప్ప, శివన్న, మంజునాథ్, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

సంసిద్ధం పోస్టర్లు ఆవిష్కరణ

కదిరి టౌన్ : రాష్ట్రంలోని వైసిపి అరాచక, అసమర్థ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలు 'సంసిద్ధం' అయినట్లు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని కందికుంట నివాసంలో శనివారం కందికుంట అభిమాని సన ఆధ్వర్యంలో చంద్రబాబు, కందికుంట ఫొటోలతో తయారు చేయించిన సంసిద్ధం పోస్టర్లను కందికుంట ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.


సింసిద్ధం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కందికుంట

ఎయిర్‌టెల్ షాపులో చోరీ

కొత్తచెరువు : స్థానిక పుట్టపర్తి రోడ్డులోని ఎయిర్‌టెల్ షాపులో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి ముసుగు ధరించి చోరీకి పాల్పడ్డాడు. బాధితుడు వేణుగోపాల్ మాట్లాడుతూ అర్ధరాత్రి సమయంలో ముసుగు ధరించిన ఓ వ్యక్తి షాపు తాళం పగలగొట్టి సీసీ కెమెరాకు బట్ట కప్పి షాపులోకి ప్రవేశించి లాకర్‌లో ఉన్న రూ. 30వేలు ఎత్తుకెళ్లాడన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు సిఐ రాజారమేష్ క్లూస్ టీంని రప్పించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

కందికుంట 'ఆత్మీయ పలకరింపు'

వేపమానిపేటలో నాయకులతో సమావేశమైన కందికుంట

తలుపుల : ఆత్మీయ పలకరింపులో భాగంగా శనివారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ మండలంలోని వేపమానిపేట గ్రామంలో టిడిపి నాయకులు పి.వి.పవన్‌కుమార్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, పూల విజయారెడ్డి, పెన్నబడివాండ్లపల్లి సర్పంచి శ్రీరామ్‌రెడ్డి, లక్కసముద్రం సర్పంచి సుదర్శన్‌రెడ్డి, వేపమాని పేట సర్పంచి మల్లికార్జున, వెంకటరెడ్డి, రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అంబు గంగిరెడ్డి, పూల గంగిరెడ్డి, సాయినాథ్‌రెడ్డి, గోవిందురెడ్డితో ఏకాంతంగా చర్చలు జరిపారు. వారిని టిడిపిలోకి ఆహ్వానించారు.

అంధత్వ నివారణకు కృషి అభినందనీయం

హిందూపురం : ట్రినిటీ ఆర్గనైజేషన్, బెంగళూరుకు చెందిన శంకర్ నేత్రాలయ ఉచితంగా అంధత్వ నివారణకు కృషి చేయడం అభినందనీయమని సి అండ్ ఐజి మిషన్ చర్చి అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, పాల్ పేర్కొన్నారు. పట్టణంలోని సి అండ్ ఐజి చర్చి ఆవరణలో శనివారం నిర్వహించిన 105వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 650 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 225 మందిని శస్త్ర చికిత్స కోసం బెంగళూరుకు తరలిచారు. గత నెల శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. శిబిరంలో ట్రినిటీ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌రాజా, ఉషారాణి, కంటి వైద్య నిపుణులు డాక్టర్. రేణు, సిమ్రాన్, ఆసుపత్రి వైద్య సిబ్బంది, క్యాంపు ఇన్‌ఛార్జి శివప్రసాద్, వాలంటీర్ రహంతుల్లా పాల్గొన్నారు.

కందికుంట సమక్షంలో టిడిపిలో చేరిక

కదిరి టౌన్ : పట్టణంలోని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో శనివారం గాండ్లపెంట మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీకి చెందిన కొండయ్య కందికుంట సమక్షంలో టిడిపిలో చేరారు. కొండయ్య మాట్లాడుతూ తనకు ఇష్టం లేకపోయినా ప్రలోభపెట్టి వైసిపి వారు బలవంతంగా ఆ పార్టీ కండువా వేశారన్నారు. దీంతో తిరిగి కందికుంట సమక్షంలో సొంత పార్టీలో చేరుతున్నానన్నారు. కార్యక్రమంలో గాండ్లపెంట మండల నాయకులు గంగాద్రి, జయరాం, పవన్ పాల్గొన్నారు.

కందికుంట సమక్షంలో టిడిపిలో చేరిన కొండయ్య